క్లుప్తంగా

27న సుందరమ్మ సత్రం భూములకు కౌలు వేలం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములకు ఈ నెల 27న బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నట్టు సత్రం ఈఓ ముమ్మన రాంబాబురెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్ 411 పార్టులోని ఆరు బిట్లుగా ఉన్న మొత్తం 67.56 ఎకరాల భూమికి 2023–24 నుంచి 2028–29 వరకు ఆరు సంవత్సరాల కాల పరిమితికి ఈ కౌలు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు గోకవరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టెండర్, కౌలు వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత డిపాజిట్ చెల్లించి టెండరు దాఖలు చేయవచ్చన్నారు. పాట పాడుకున్న వారు శిస్తు మొత్తం తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 89850 71835 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

పేదలకు ఉత్తమ విద్యే లక్ష్యం


కొంకుదురులో నగదు పురస్కారాలు పొందిన వారితో నాయకులు

బిక్కవోలు: పేదలకు ఉత్తమ విద్య అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. బుధవారం కొంకుదురు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ప్రథమ స్థానం సాధించిన పడాల శివసాయికి రూ.మూడు వేలు, ద్వితీయ స్థానం పొందిన గోలుగూరి గీతాహాసినికి రూ రెండు వేలు, తృతీయ స్థానంలో నిలిచిన యువ సూర్యశ్రీరామ్‌కు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ఎంపీటీసీ కొంకుదురు పీవీ, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డిరాజా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం


రామవరంలో కౌలు రైతుకు సాగుహక్కు కార్డు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

అనపర్తి: వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. రామవరం, కుతుకులూరు గ్రామాల్లో కౌలు రైతులకు మంజూరైన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతు గుర్తింపు కార్డుల (సీసీఆర్‌సీ)తో ప్రభుత్వం అందించే సాయానికి అర్హత పొందుతారన్నారు. కుతుకులూరు సర్పంచి గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, రామవరం వీఆర్వోలు జి.శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గోకవరం: స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాంచి మేనేజర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎల్ఐసీ సిబ్బంది, ఏజెంట్లకు పీఎంపీ వైద్యుడు చిన్నిబాబు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అనంతరం యోగా చేయడం వలన కలిగే ప్రయోజనాలను సిబ్బందికి బ్రాంచ్ మేనేజర్ విద్యాసాగర్ వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఎలిపే శ్రీనివాస్, స్టాఫ్ యూనియన్ ప్రెసిడెంట్ చక్ర శ్రీను, ఏజెంట్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నూకరాజు, సెక్రటరీ ఎస్.నాగరాజు, ఈసీ సభ్యుడు జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారాహీదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ


వారాహీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ బుధవారం వారాహీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారిని వారాహీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆరోగ్యానికి తొలిమెట్టు యోగా

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


యోగా సాధన చేస్తున్న జీఎస్ఎల్ వైద్య కళాశాల విద్యార్థులు

అనపర్తి: శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా తొలిమెట్టు అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్థానికంగా జీబీఆర్ యోగా, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతీయ సనాతన సంప్రదాయ వారసత్వానికి ప్రతీకైన యోగా క్రియ నిత్య సాధన ద్వారా ప్రతి వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ప్రశాంత జీవనాన్ని గడపవచ్చన్నారు. కోవిడ్ పరిస్థితుల తరువాత ప్రతి ఒక్కరికీ ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో యోగా చేసేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. క్రమం తప్పకుండా సంవత్సరం పాటు యోగా చేసిన గ్రామానికి పెద్దరాజును ఎమ్మెల్యే గోల్డ్ మెడల్, పూలమాలలు, దుశ్శాలువాతో అభినందించారు. అనంతరం యోగా క్లబ్ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. సీఐ వి.శ్రీనివాస్, జీబీఆర్ యోగా క్లబ్ అధ్యక్షుడు తేతలి త్రినాథరెడ్డి, సీడీఆర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కర్రి సునీల్‌కుమార్‌రెడ్డి, యోగా, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు నల్లమిల్లి సాయిరామారెడ్డి, ఎస్ఎస్, డాక్టర్ రామచంద్రారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, లెఫ్ట్, పావని దొర తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: యోగా వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం తాడి జయకృష్ణారెడ్డి అన్నారు. పందలపాకలోని శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా దినోత్సవం నిర్వహించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు ద్వారంపూడి యువరాజారెడ్డి, కృష్ణారెడ్డి మాట్లాడారు. కొంకుదురు ఉన్నత పాఠశాల, కొమరిపాలెం అరవింద్ యోగా శిక్షణ కేంద్రంలో యోగాపై అవగాహన కల్పించారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన అన్నారు. పీవీ ప్రసాద్, సీహెచ్ వీరబాబు, మేడిశెట్టి సాయిశ్రీను, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.రంగంపేట పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో వైద్యురాలు లావణ్య యోగాసనాలు వేయించారు. ఎంపీహెచ్‌ఈఓ శంకర్, సచివాలయ కార్యదర్శి బి.వెంకన్నబాబు పాల్గొన్నారు.

పెదపూడి: స్థానిక గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మెంబర్ కోరా బాబి, వైఎస్సార్ సీపీ మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో, ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ఆవరణలలో యోగా గురువులు యోగాసనాలు వేయించారు. గమ్యం పాఠశాల, జూనియర్ కాలేజీలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఎన్నో ప్రయోజనాలు

రాజానగరం: యోగా సాధనతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందుకోవచ్చని జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నేటి ఆధునిక కాలంలో ఎదురయ్యే అనేక రకాల ఒత్తిళ్లను అధిగమించేందుకు, మానసిక ప్రశాంతతను పొందేందుకు యోగా ఉపయోగపడుతుందన్నారు. వైద్య విద్యార్థులు ఆసనాలు, ప్రాణాయామం, పిరమిడ్, రాజయోగ వంటివి ప్రదర్శించారు. వైద్య సిబ్బంది అంతా కొద్దిసేపు యోగా సాధన చేశారు.

- వెలుగుబందలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, గైట్ డిగ్రీ విద్యార్థులు యోగాసనాలు వేశారు. దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీ కళాశాల, భూపాలపట్నంలోని రైట్ ఇంజినీరింగ్, తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్, రాజానగరంలోని వివిధ కళాశాలలో ప్రత్యేక పర్యవేక్షుల ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. బీజేపీ ఆధ్వర్యంలో రాజానగరంలోని ఒక లేఅవుట్‌లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

జీవితంలో ఒక భాగం

యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యూనివర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగా కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ సూచించారు. కానవరంలోని శ్రీరాపర్తి రామయోగ ఇనిస్టిట్యూట్‌కి చెందిన డాక్టర్ ఎంవీజీఎస్ శర్మ, ప్రిన్సిపాల్ ఎస్.శివశంకర్, యోగా టీచర్ కె. అప్పలరాజు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.


క్రమం తప్పకుండా యోగా చేస్తున్న సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


పందలపాక ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు


రంగంపేట పీహెచ్‌సీ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న డాక్టర్ లావణ్య, సిబ్బంది

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి


ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రంగంపేట: ప్రభుత్వం ఎత్తిపోతల పథకాల ద్వారా అందించే సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకుని, అధిక దిగుబడులు సాధించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎత్తిపోతల పథకాల సమాఖ్య అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి సూచించారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటి లబ్ధి పొందుతున్న మర్రిపూడి రైతులనుద్దేశించి ఆయన బుధవారం మాట్లాడారు. గోదావరి జలాలు మర్రిపూడిలో 150 ఎకరాలకు అందడానికి ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోతల పథకమే కారణమని, దీనివల్ల బీడు భూములు మాగాణిగా మారాయన్నారు. జిల్లా రైతు సంఘం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు సకాలంలో నీటి తీరువా చెల్లించాలని, స్వల్పకాలిక వరి విత్తనాలు వాడాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఎత్తిపోతల పథకం ద్వారా నిండిన అచ్చెమ్మ చెరువును రైతులతో సందర్శించారు. ఆయకట్టు రైతులు మోదుకూరి బంగార్రాజు, పుట్టా గోపాలకృష్ణ, ముత్యాల నరసింహం, రిమ్మలపూడి విజయసాయి పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించాలని ధర్నా


పెదపూడిలో ర్యాలీ చేస్తున్న మాలమహానాడు, దళిత, ప్రజా సంఘాల నాయకులు

పెదపూడి: గోకవరం మండలం తిరుమలాయపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతుల కొండబాబు డిమాండ్ చేశారు. మాలమహానాడు, ప్రజా, దళిత సంఘాల నాయకులు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కొండబాబు మాట్లాడుతూ తిరుమలాయపాలెంలో ఎస్సీ మహిళలను గాయపరిచిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలన్నారు. మాల మహానాడు జాతీయ కన్వీనర్ లింగం ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు నువ్వుల రాజు, సీపీఐ, ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుబ్బల ఆదినారాయణ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజేత వెదుళ్లపల్లి హైస్కూల్


విజేతలకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఎంఈవో స్వామి నాయక్

సీతానగరం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీతానగరం హైస్కూల్లో ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్సియల్ లిటరసి 2023 క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలో హైస్కూళ్లు, మండల ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. ఒక్కొక్క స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. మొత్తం తొమ్మిది టీమ్‌లు పోటీలో పాల్గొన్నాయి. ఇందులో వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సత్యం హిందుశ్రీ, పుట్టా సాయిచరణ్ విజేతలుగా నిలిచారు. వీరికి రూ.5 వేల నగదు పురస్కారాన్ని యూనియన్ బ్యాంక్ రఘుదేవపురం శాఖ మేనేజర్ అనిల్ కుమార్, ప్రశంసా పత్రాలను ఎంఈవో స్వామి నాయక్ అందించారు. ఈ సందర్భంగా వెదుళ్లపల్లి హైస్కూల్ హెచ్ఎం ఎల్.సీతారత్నం మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన తమ విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గైడ్ టీచర్‌గా డి.సుధాకర్, క్విజ్ మాస్టర్‌గా కేఎల్ మనోహర్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ.మోహన్, వి.శ్రీనివాస్, ఎస్.భగవాన్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి బాటలు



పెదపూడి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా తులసి

పెదపూడి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించే వారిపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ, విద్యాశాఖ, ఇరిగేషన్ తదితర శాఖల్లో జరుగుతున్న పనులపై ఆయా అధికారులు వివరించారు. తహసీల్దార్ టి.సుభాష్ మాట్లాడుతూ రామేశ్వరం, ఏపీత్రయం గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇప్పటివరకూ 11 గ్రామాల్లో పూర్తయ్యిందన్నారు. ఎంపీడీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పనుల గురించి ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. వైస్ ఎంపీపీలు కరెడ్ల వెంకన్నబాబు, ద్వారంపూడి పద్మారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై పోటీలు

గోకవరం: బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గోకవరం ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బ్రాంచి మేనేజర్ ఆర్.ఆనంద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ జిల్లా పరిషత్ హైస్కూళ్లకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో మొదటి రెండు స్థానాల్లో కామరాజుపేట విద్యార్థులు, మూడో స్థానంలో రంపయర్రంపాలెం విద్యార్థి నిలిచారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులు జమ చేస్తామని బ్రాంచి మేనేజర్ ఆనంద్ తెలిపారు.

అనపర్తిలో చోరీ

అనపర్తి: స్థానిక భవానీనగర్‌లోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి రూ. 85 వేల చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. ఫైర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నల్లమిల్లి వీరవెంకట సత్యనారాయణరెడ్డి స్థానిక భవానీ నగర్‌లో తన కుటుంబంతో నివాస ఉంటున్నారు. సత్యనారాయణరెడ్డి తల్లి బుధవారం వేకువజామున లేచేసరికి మెయిన్ డోర్ తెరిచి ఉండడంతో కుమారుడిని లేపి విషయాన్ని తెలిపింది. దీంతో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారని నిర్ధారించుకుని పరిశీలించగా బ్యాగులో ఉంచిన రూ. 85 వేలు దొంగిలించినట్లు గుర్తించారు. దీనిపై బుధవారం అనపర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సీతానగరం: ఇనుగంటివారిపేటకు చెందిన వేమగిరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. నాగరాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెలలో వెదుళ్లపల్లికి చెందిన బొల్లి ఆనంద్ కృష్ణారావు పనికి కిరాయికి వెళ్లాడు. కిరాయి డబ్బులు కోసం వెళ్లిన నాగరాజుపై దాడి చేసి, కులం పేరుతో దూషించారు. ఈ నేపథ్యంలో బొల్లి ఆనంద కృష్ణారావు, బొల్లి పుల్లారావుపై ఎస్టీ, ఎస్సీ కేసు నమోదు చేశారు.

24న ఎంపికలు

మధురపూడి: కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 24న కోరుకొండ మండలం దోసకాయలపల్లి హైస్కూల్ మైదానం ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 8 నుంచి పదేళ్ల లోపు విద్యార్థులు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష'

అనపర్తి: ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పగడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం కుతుకులూరు, స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి వివిధ గ్రామాల్లో జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకూ షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దీనికి సంబంధించి వలంటీర్లు ఈ నెల 24 నుంచి ఆయా గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వే ప్రారంభించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆయా సచివాలయాల పరిధిలో డిజిటల్ అసిస్టెంట్లకు అందజేసి ఆన్‌లైన్ చేసిన తరువాత వచ్చే టోకెన్ నంబర్లను దరఖాస్తుదారుకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు.

చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వైఎంఏ హాలులో అండర్ – 7 బాలబాలికల విభాగంలో చదరంగం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బాలుర విభాగంలో ఎస్.సాయి విభు, పి.కార్తికేయ, బాలికల విభాగంలో డి.ఆధ్య, ఏ.వేదాన్షి విజయం సాధించారు. విజేతలు జూలై 28 నుంచి 30 వరకూ విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తారని సంఘం కార్యదర్శి జీవీ కుమార్ తెలిపారు.

నరసన్న ఆలయ అభివృద్ధికి సహకరించాలి


జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సుబ్బారెడ్డిని కలిశారు. గతంలో కోరినట్టుగా ఆలయంలో ఐదు అంతస్తుల రాజగోపురం నిర్మాణం, కొండపైన ప్రాకార మండపం, రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. ఈ నిర్మాణ పనుల నిమిత్తం నిధులు మంజూరు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

రంగంపేట: ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. పెదరాయవరం గ్రామం వద్ద ఏడీబీ రోడ్డులో మంగళవారం రాత్రి ప్రైవేట్ కళాశాల బస్సు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు (60) తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 అంబులెన్స్‌లో బాధితుడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి వివరాలు తెలిసిన వారు రంగంపేట పోలీస్ స్టేషన్‌లో తెలపాలని ఎస్సై అన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

రాజానగరం: భారతీయ సంస్కృతిలో మానవ విలువలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ అన్నారు. వెలుగుబందలోని గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సహకారంతో సార్వత్రిక మానవ విలువలు అనే అంశంపై మూడు రోజులుగా జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారంతో ముగిసింది. శర్మ మాట్లాడుతూ బీటెక్ చదువుతున్న విద్యార్థులకు మానవ విలువలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో మూడు క్రెడిట్స్‌తో కూడిన ఈ కోర్సును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎన్.సునీల్‌కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ ఎన్.లీలావతి, డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ డాక్టర్ వి.కుసుమకుమారి, ప్రొఫెసర్ గీత, ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రీసర్వే

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం, జంబూపట్నం, బూరుగుపూడి గ్రామాల్లో గురువారం నుంచి భూ రీసర్వే చేయనున్నట్టు తహసీల్దార్ పాపారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సర్వేకు రైతులు సహకరించాలన్నారు.

అనాథలైన చిన్నారులకు ప్రభుత్వ సాయం


రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సాయాన్ని అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి, అనాథలైన ఇద్దరు చిన్నారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం అందజేశారు. గతంలో కాకినాడ ఏడీబీ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో లాలాచెరువు హెచ్‌బీ కాలనీకి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు మృత్యువాతపడ్డారు. వారిలో వనమూడి వీరేంద్ర అవినాష్ (12), దేవిప్రియ (10) తల్లిదండ్రులు కూడా ఉన్నారు. కాగా.. పిల్లల చదువుకు సాయమందించి, తోడుగా నిలవాలని ఇటీవల కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, ఒక్కొక్కరికీ రూ. ఒక లక్ష ఆర్థిక సాయాన్ని మంజూరు చేసేలా కృషి చేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జక్కంపూడి విజయలక్ష్మి ఆ చిన్నారులకు అందజేశారు. ఎల్లప్పుడు అండగా ఉంటామనే భరోసాను అందించారు.

వెదుళ్లపల్లి జూనియర్ కళాశాల సందర్శన

సీతానగరం: మండలంలోని వెదుళ్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో మంచి విద్యను అందిస్తున్నారన్నారు. ప్రైవేటు కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలను జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు మంచి లక్ష్యం ఏర్పర్చుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ –2 సత్యం మదన్ బాబు, పార్టీ నాయకులు తన్నీరు త్రిమూర్తులు, చిన్ని, ఈతకొట్టి పోశి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు


విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

బిక్కవోలు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో క్విజ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బుధవారం భారతీయ రిజర్వ్ బ్యాంకు ఆంధ్ర ప్రదేశ్ సౌజన్యంతో ఆర్థిక సమీకృత అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో బిక్కవోలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా శాఖ సిబ్బంది ఆల్ ఇండియా స్కూల్ క్విజ్ 2023 పోటీలను నిర్వహించారు. ఇందులో బిక్కవోలు, కొంకుదురు, మెళ్లూరు, బలభద్రపురం, ఇలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఇలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.అరుణ్‌కుమార్, కె.పండులకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మెళ్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.ఓంసత్య, ఎస్‌డీఎస్ మహాలక్ష్మిలకు రూ. 4 వేలు, తృతీయ స్థానం పొందిన కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.శ్రావ్యాంజలి, ఎ.వెంకటలక్ష్మిలకు రూ.3 వేలు అందించారు. ఎంఈవో–2 పూర్ణచంద్రరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ అడపా ఉదయ్‌కిరణ్, డిప్యూటీ మేనేజర్ వీవీ రమణమూర్తి, హెచ్ఎం పీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని ఎంఈఓ కార్యాలయంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ బి.కృష్ణవేణి ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ టి.కుశలవ దొర, ఎంఈఓ–2 సుజాత ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గాదరాడ హైస్కూల్‌కు చెందిన జి.రమ్యశ్రీ, కేవీవీఎస్ దీపక్ ప్రథమ బహుమతి (రూ.5వేలు), కోరుకొండ హైస్కూల్‌కు చెందిన ఎస్.హర్షిత, కె.అశ్విత ద్వితీయ బహుమతి (రూ.4 వేలు), గుమ్ములూరు హైస్కూల్‌కు చెందిన బి.యువశ్రీ, బి.గౌతమీ కావ్య తృతీయ బహుమతి (రూ.3 వేలు) సాధించారు.